# అక్రమంగా షెడ్ల నిర్మాణం

## ఉప్పల్ భగాయత్‌లో అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు ◆ ప్రభుత్వ ఆదాయానికి గండి

ఉప్పల్, జూన్ 14 : అక్రమ నిర్మాణాలు పలువురికి కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. చర్యలు చేట్టాల్సిన అధికారులు, అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఒకే లేఅవుట్‌లో వంద నుంచి నూటయాభైకి పైగా భారీగా వ్యాపార సముదాయాలకు కావాల్సిన షెడ్డు నిర్మాణాలు వెలిశాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోవడంతో వ్యాపార కేంద్రాలు వెలిశాయి. వ్యాపార కేంద్రాలకు ట్యాక్స్‌ను విధించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం, అక్రమ నిర్మాణాలపై రెట్టింపు పన్నులు విధించకపోవడంతో అనుమానాలకు తావిస్తున్నది.



మరో షెడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు

### నిబంధనలు పాటించని వారిపై చర్యలు..

నిబంధనలు పాటించని వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి, నిబంధనల మేరకు కఠిన చర్యలు చేపడతాం. ట్యాక్స్ విధింపు, వ్యాపార కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష చేస్తాం. మా దృష్టికి వచ్చిన అన్ని అంశాలపై దృష్టి సారిస్తాం. వ్యాపార కేంద్రాల నిర్వహణపై ప్రత్యేకంగా విచారిస్తాం. ఉప్పల్ భగాయత్‌లో చేపడుతున్న షెడ్ల నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తాం.

– ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్, ఉప్పల్ సర్కిల్

### ఉప్పల్ భగాయత్‌లో షెడ్డు నిర్మాణాలు..

ఉప్పల్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నది. మూసీకి ఆనుకొని ఉన్న భగాయత్ లేఅవుట్‌లోని ప్రాంతంలో కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులు లేవు. అయితే వీటికి విరుద్ధంగా వేల సంఖ్యలో వ్యాపార కేంద్రాలు వెలిశాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మరిన్ని నిర్మాణాలు వెలుస్తున్నాయి. వీటిలో ప్రధానంగా భూ యాజమానుల వద్ద భూమిని తీసుకొని, వ్యాపారులు షెడ్డు నిర్మాణాలు చేపట్టి, వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. 200 నుంచి వేయి గజాల వరకు షెడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిలో ఇప్పటికే బహుళ నిర్మాణాలు చేపట్టారు. దర్జాగా పెద్ద బోర్డులతో వ్యాపార కేంద్రాలు దర్శనమిస్తున్నాయి.

### ట్యాక్స్‌లేదు... అనుమతి తీసుకోరు..

ఉప్పల్ భగాయత్ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసి, భూ యజమానులకు కేటాయించింది. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన లేఅవుట్‌లో విశాలమైన రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే లేఅవుట్‌లో భారీగా షెడ్లు నిర్మించడంతో భగాయత్ లేఅవుట్ రూపురేఖలు మారిపోయాయి. అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టకుండా, అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో భారీ భవనాలు వెలిశాయి. వీటికితోడు భారీ షెడ్డు నిర్మాణాలతో అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోసినట్లైంది. అయితే నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు చేపట్టడం, అక్రమ నిర్మాణదారులకు 200 శాతం ట్యాక్స్ వేయాల్సిన అధికారులు, అసలు ట్యాక్స్ విధించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విజిలెన్స్ విచారణతోనే అక్రమదందాకు అడ్డుకట్ట

అక్రమ నిర్మాణాలు, ట్యాక్స్ విధింపుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపడితేనే విషయం వెలుగులోకి వస్తుందని భగాయత్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం, ఒక్కటి కూడా అక్రమ నిర్మాణం కూల్చివేయకపోవడం, నోటీసులతోనే సరిపెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## రెగ్యులర్ ఉద్యోగులతోనే ఆస్తి పన్ను వసూళ్లు..

### మున్సిపాలిటీల్లో మార్పులకు శ్రీకారం

మేడ్చల్, జూన్14(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో పలు మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పన్ను వసూళ్లకు సంబంధించి నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించి రెగ్యులర్ ఉద్యోగుల ద్వారానే నిర్వహించేలా మున్సిపల్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆస్తి పన్ను వసూళ్లలో అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 13 మున్సిపాలిటీల్లో చర్యలు తీసుకోనున్నారు. మున్సిపాలిటీల్లో సిబ్బంది చేతి యంత్రాలతో ప్రాపర్టీ ట్యాక్స్‌ను వసూలు చేసి నగదును జమ చేస్తారు. దీనికి సంబంధించి అనేక చోట్ల ఆస్తి పన్ను వసూళ్లకు అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే వారిపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతుంది. దీంతో వారిని వసూళ్ల విభాగం నుంచి తప్పించి ఇతర బాధ్యతలను అప్పగించాలని, ఆస్తి పన్ను వసూళ్లకు రెగ్యులర్ ఉద్యోగులను నియమించేలా నిర్ణయం తీసుకున్నారు.

## 20న నులిపురుగుల నివారణ మాత్రలు



సిటీబ్యూరో, జూన్ 14 ( నమస్తే తెలంగాణ ) : ఆరోగ్యవంతమైన సమాజం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండజోల్‌ను వేయించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈనెల 20న జాతీయ నులిపురుగుల దినాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మాత్రల పంపిణీపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1నుంచి 19 ఏండ్ల వయసున్న పిల్లలందరికి నులి పురుగుల నివారణ మాత్రలను వేయించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పద్మజ, డీఈఓ రోహిణీ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

## భవిష్యత్‌లో నిర్మాణాలు చేపట్టకుండా జీహెచ్‌ఎంసీ నర్సరీకి ఏర్పాట్లు

బేగంపేట్ జూన్ 14: బేగంపేట్ డివిజన్ మాతాజీనగర్‌లోని సర్వేనం. 194/8/1లో సుమారు 10 ఎకరాల ఎఫ్‌టీఎల్ స్థలంలో చేపట్టిన వివాదాస్పద నిర్మాణాలతో పాటు అక్రమంగా నిర్మించిన పలు నిర్మాణాలను బేగంపేట్ జీహెచ్‌ఎంసీ అధికారులు కూలగొట్టారు. గతంలో ఓ బడా ప్రైవేట్ సంస్థ ఇక్కడ ప్రైడ్ ఇండియా పేరుతో అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి ఈ ఎఫ్‌టీఎల్ స్థలంలో వెంచర్‌ను ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు ప్లాట్స్‌ను విక్రయించారు. దీంతో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపడుతుండగా అది అక్రమ వెంచర్, ఎఫ్‌టీఎల్ ల్యాండ్ అని జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు తేల్చారు. ప్రైడ్ ఇండియా సంస్థ ప్లాట్లు అమ్మేసి అక్కడ నుంచి దుకాణం ఎత్తేసింది. అప్పటి నుంచి అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు ఎలాగైనా ఇండ్లను నిర్మించుకోవాలని 2016 నుంచి అప్పుడప్పుడు నిర్మాణాలు చేపట్టడం ప్రారంభించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ అధికారులు వచ్చి కూల్చివేయడం జరుగుతుంది. ఇలా 2016, 2019, 2021, 2024 ఏప్రిల్‌లో ఇలా పలు మార్లు నిర్మాణాలను కూల్చి వేశారు. తాజాగా అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో కొందరు ఇలాగైతే లాభం లేదనుకొని ఆ వెంచర్‌లో ఓ మసీదు నిర్మాణం చేపట్టారు. ఇది గుర్తించిన స్థానికులు అక్కడ ధర్నా చేసి ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు రెండు రోజుల పాటు అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ కూల్చివేతల్లో జీహెచ్‌ఎంసీ జోనల్ స్థాయి అధికారులతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.




అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అనంతరం ఆ స్థలంలో జీహెచ్‌ఎంసీ నర్సరీ ఏర్పాటు చేస్తున్నట్టు బోర్డును పెడుతున్న అధికారులు

### ఆ స్థలంలోనే నర్సరీ ఏర్పాటుకు నిర్ణయం

ఎఫ్‌టీఎల్ స్థలంలో ఎన్నిసార్లు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినా.. కొనుగోలు దారులు తిరిగి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడ నర్సరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అక్రమ నిర్మాణాలను తొలగించిన అనంతరం అక్కడ నర్సరీని ఏర్పాటు చేస్తున్నట్టు ఓ బోర్డును ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే తిరిగి కూల్చివేయడం తప్పదని అధికారులు హెచ్చరించారు.

## సహజత్వం కోల్పోతున్న మానవుడు



నేరేడ్‌మెట్, జూన్ 14: ప్రపంచంలో కృత్రిమ వస్తువులు మానవులను పాడు చేస్తున్నాయని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామీజీ బోధమయానంద మహారాజ్ అన్నారు. శుక్రవారం సైనిక్‌పురిలోని భవన్స్ వివేకానంద కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. భవన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌వీఆర్‌కే. చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పైకి కనిపిస్తున్న వస్తువులన్నీ తాత్కాలికమైన సంతోషాన్ని మాత్రమే ఇస్తున్నాయని, దీనికి అలవాటు పడిన మానవుడు తన సహజత్వాన్ని కోల్పోతున్నాడని ఉదాహరణలతో వివరించారు. మాతృభూమి గొప్పతనం, రామకృష్ణ మఠం వారు చేసే సేవల గురించి వివరించారు. జీపీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ షీమా ఘోష్, కళాశాల పూర్వ విద్యార్థి క్రీడాకారుడు రాహుల్‌సింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కెప్టెన్ సెక్రటరీ డి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### ● శంకర్ యాదవ్‌కు నివాళి..



ఇటీవల మరణించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, శంకర్ యాదవ్ ఐదు రోజుల కార్యక్రమం శుక్రవారం మారేడ్‌పల్లి రాధికా కాలనీలోని ఆయన నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరై శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

- మారేడ్‌పల్లి, జూన్ 14

## బోనాలకు రూ. 25 కోట్లు కేటాయించండి



సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ ) : వచ్చే నెలలో జరగబోయే ఆషాఢ బోనాలకు నగరంలోని దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహించడానికి రూ. 25 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం ఆయన నివాసంలో లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు కలిసి కోరారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్ గౌడ్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు బాలరాజ్ యాదవ్, మిట్టపల్లి బాబురావు, జగదీష్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, రవీందర్ సాగర్, మిట్టపల్లి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పథకాల అమలుకు దోహదం

### వెబ్ వెరిఫికేషన్ సిస్టమ్ ప్రారంభం

చిక్కడపల్లి, జూన్14 : కార్మిక శాఖ సంక్షేమ బోర్డు వివిధ పథకాల కింద క్లెయిమ్‌లను సమర్థవంతంగా నిర్ధారించేందుకు నూతన విధానం ఎంతో దోహద పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో రాణి కుముదిని, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్యతో కలిసి తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన టీబీఓసీడబ్ల్యూడబ్ల్యూబీ పోర్టల్ (వెబ్ వెరిఫికేషన్ సిస్టమ్)ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. గడిచిన 6 నెలల్లో 50 వేలకు పైగా లబ్ధిదారులను గుర్తించి పథకాలను అందించడం అభినందనీయమన్నారు. కమిషనర్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ... వెబ్ ధ్రువీకరణ వ్యవస్థను పోర్టల్‌తో అనుసంధానించ బడిందన్నారు. ధ్రువీకరణ కోసం జీహెచ్‌ఎంసీ, సీడీఎంఏ, పంచాయతీ రాజ్ నుంచి జనన, మరణాల డేటాతో సజావుగా కనెక్ట్ చేయబడిందన్నారు. బోర్డు ద్వారా కార్మికులకు అందుతున్న పథకాలను వేగంగా అందించడానికి దోహదపడుతుందని శాఖ అదనపు కమిషనర్, బోర్డు కార్యదర్శి ఈ.గంగాధర్ తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కమిషనర్లు చతుర్వేది, శ్యామ్ సుందర్ రెడ్డి, సునీత, డీసీఎల్ శ్రీనివాస్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, సీఐఓ ప్రసన్నలక్ష్మి, ఎన్ఐసీ సీనియర్ డైరెక్టర్ అర్థిమార్తుర్, డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.



వెబ్ వెరిఫికేషన్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని

## రక్తదానంపై అవగాహన పెరగాలి

### కిమ్స్ దవాఖానలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం



కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన అంతర్జాతీయ రక్తదాన దినోత్సవంలో భాగంగా కేక్ కట్ చేస్తున్న కిమ్స్ ఆసుపత్రి గ్రూప్ చైర్మన్, ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

బేగంపేట్, జూన్ 14: రక్తదానంపై యువకుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని కిమ్స్ ఆసుపత్రి గ్రూప్ చైర్మన్, ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ... ఇటీవల పెరుగుతున్న రక్తం అవసరాల రీత్యా.. సరిపడా రక్తం అందుబాటులో లేకపోడవంతో అనేక ఇబ్బందులకు దారి తీస్తుందన్నారు. కిమ్స్ ఆసుపత్రిలో గణాంకాలు పరిశీలిస్తే 30 నుంచి 50 ఏండ్ల వరకు ఉన్న వారు రక్తదానం చేస్తున్నట్టు తేలిందన్నారు. కానీ 18 నుంచి 30 ఏండ్లు ఉన్న యువకులు రక్తదానం చేసేందుకు రావడం లేదని, వారు ముందుకు రావాలని సూచించారు. రక్తదానంపై అపోహలు ఉండటం వల్ల ఈ ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. రక్తదానంపై యువతకు అవగాహన అవసరమని బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ కీర్తి పేర్కొన్నారు. ఇందు కోసం కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేశారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలి

కందుకూరు, జూన్ 14 : నీట్ పరీక్షను రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి డిమాండ్ చేశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అవకవతకలు జరిగాయని ఆరోపించారు. శుక్రవారం మండల నాయకులతో కలిసి కందుకూరులో హైదరాబాద్– శ్రీశైలం రహదారిపై నిరసన చేశారు. పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నహీం, ప్రవీణ్ ముదిరాజ్, నాగరాజు, రవి, నవీన్ ముదిరాజ్, జాంగిర్, వాసు, పాల్గొన్నారు.

## సివిల్స్‌కు ఉచిత శిక్షణ

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 14: తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఉచితంగా సివిల్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు, అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులను ఆబ్జెక్టివ్ ఆప్టిట్యూడ్ పరీక్షతో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 30 లోపు.. HTTP://STUDYCIRCLE.EGG.GOV.IN లో దరఖాస్తు చేసుకోవాలని, 6281766534లో సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థులకు రుణాలు అందించాలి

సిటీబ్యూరో, జూన్ 14 ( నమస్తే తెలంగాణ ) : బ్యాంకులు తక్షణమే విద్యా రుణ శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు రుణాలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన డీసీసీ/డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత ఆర్థిక సంవత్సరంలో భాగంగా విద్యా రుణాలు 1203.84 కోట్లు లక్ష్యం కాగా 131.95 కోట్లు (10.96శాతం) మాత్రమే అందించడం పై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఆర్థిక సంవత్సరంలో 55,908.22 కోట్లు లక్ష్యం కాగా.. ఇందులో 37,185.65 కోట్లు సాధించామని కలెక్టర్ తెలిపారు. స్వానిధి ద్వారా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రుణాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.గోమతి, నాబార్డ్ డీడీ ఎం. హర్ష రఘురాం పాల్గొన్నారు.

## ఆత్మీయ వేడుకలకు తెలంగాణ గమ్యస్థానం

### మంత్రి జూపల్లి కృష్ణారావు




నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మాదాపూర్, జూన్ 14: ఆత్మీయ వేడుకలకు తెలంగాణ గమ్య స్థానమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తెలంగాణలో అన్ని రకాల ఈవెంట్లను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివాహ వేడుకలతో పాటు ఇతర ఈవెంట్లను సాకారం చేసుకునేందుకు కావాల్సినవన్నీ అందిస్తుందన్నారు. భారతదేశంలోని ఉత్తమ వివాహ గమ్య స్థానాలకు గూగుల్‌లో వెతకగా ఆ జాబితాలో తెలంగాణ పేరు లేదన్నారు. ఆకర్షణీయమైన వివాహ గమ్యస్థానాలను అభివృద్ధి చేయాలనుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల బలరాంతో పాటు నిర్వాహకులు ఉన్నారు.

## కల్యాణ్ జువెల్లర్స్ 'మెగా బొనాంజా' ఆఫర్

సిటీబ్యూరో, జూన్ 14 ( నమస్తే తెలంగాణ ) : కల్యాణ్ జువెల్లర్స్ శుక్రవారం మెగా బొనాంజా ప్రకటించింది. ఆభరణాల మేకింగ్ చార్జీలపై 50 శాతం రాయితీ అందిస్తోంది. ఈ మేరకు కల్యాణ్ జువెల్లర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ కల్యాణరామన్ తెలిపారు. మార్కెట్‌లో అత్యంత తక్కువ ధరలతో కేవలం కల్యాణ్ జువెల్లరీల్లోనే బంగారం 'కల్యాణ్ స్పెషల్ గోల్డ్ రేట్' తో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఫాదర్స్ డే, బక్రీద్, దసరా తదితర ఫెస్టివల్ సీజన్లను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా కల్యాణ్ జువెల్లర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాగా, ఈ ఆఫర్ ఈనెల 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు.

## రేపు మోకిలలో శారీథాన్



సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): నగరంలోని స్వచ్ఛంద సేవా సంస్థ గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 16న మోకిలలో శారీథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణపై పనిచేస్తున్న గండిపేట వెల్ఫేర్ సొసైటీ మహిళల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు వినూత్నంగా మోకిల శారీథాన్‌ను నిర్వహిస్తోంది. మోకిలలోని పీజీ హిల్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, రచయిత గీతా భాస్కర్, మిల్లెట్ బ్యాంక్ పౌండర్ విశాల రెడ్డితో పాటు 200కు పైగా మహిళలు ప్రత్యేకంగా చీరలు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకురాలు వాణి తెలిపారు. మహిళలకు 3కె, 5కె రన్‌తో పాటు ఉత్సాహం నింపే కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు

సుల్తాన్‌బజార్, జూన్ 14: ఓ వ్యక్తిని హత్య చేసిన ఇద్దరు పాత నేరస్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ కథనం ప్రకారం... బుధవారం రాత్రి నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు గొడవపడి ఒకరినొకరు కొట్టుకున్నారు. కాగా ఈ గొడవలో ఓ వ్యక్తి చనిపోయాడు. కాగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి హత్యకు పాల్పడ్డ నాంపల్లికి చెందిన మహమ్మద్ గఫూర్(32), ఒడిశాకు చెందిన మహమ్మద్ జావీద్(25)లను అరెస్టు చేశారు. అయితే ఈ నెల 12న రాత్రి ఇరువురు మరో వ్యక్తితో డబ్బుల విషయమై నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై గొడవపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. మృతుడి కారణంగా తాము గాయపడ్డామని నిందితులు ఘటనా స్థలానికి తిరిగి వచ్చి అతడి ఛాతిపై పెద్ద రాయితో దాడి చేయడంతో అక్కడే చనిపోయాడు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## గ్రేటర్ పరిధిని పెంచే ఆలోచన విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ రెడ్డి

హిమాయత్‌నగర్, జూన్ 14: గ్రేటర్ హైదరాబాద్ పరిధిని పెంచే ఆలోచనను విరమించుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. గ్రేటర్‌లో విలీనమైతే రంగారెడ్డి జిల్లా ఉనికి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వర్గం ప్రాబల్యాన్ని పెంచేందుకు ఈ విలీనం ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో శ్రీశైలం, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.